క్లుప్తంగా

వైభవంగా మహాలక్ష్మమ్మ జాతర


పెదపట్నంలంకలో కొలువైన మహాలక్ష్మమ్మ

మామిడికుదురు: పెదపట్నంలంక గ్రామంలో కొలువైన మహాలక్ష్మమ్మ జాతర ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలు, చిత్ర, విచిత్ర వేషధారణలు, శక్తివేషాలు, బుట్ట బొమ్మల కోలాహలం, తీన్‌మాన్ విన్యాసాలు, భారీ బాణసంచా కాల్పులు, పూజ ఘటం ఊరేగింపు నడుమ జాతరని వైభవంగా జరిపించారు. సోమవారం అమ్మవారికి నైవేద్యాలు చెల్లిస్తారని, మంగళవారం సిరి బొమ్మ తీర్థం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. అమ్మవారి జాతర సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాల కాంతులతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

దాసాంజనేయ స్వామి వారి గ్రామోత్సవం


ఎల్.గన్నవరంలో ఊరేగుతున్న దాసాంజనేయ స్వామి

పి.గన్నవరం: ఎల్.గన్నవరం పాత అక్విడెక్టు సమీపాన వేంచేసిన దాసాంజనేయ స్వామి వారి ఆలయం వద్ద హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గత నాలుగు రోజులుగా స్వామి వారికి ఆలయ అర్చకులు ఖండవిల్లి నారాయణచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం స్థానిక హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

ఆలయ వ్యవస్థాపకుడు రామస్వామి జయంతి


రామస్వామికి ఈఓ సత్యనారాయణరాజు నివాళి

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి దేవస్థానం వ్యవస్థాపకుడు మొల్లేటి రామస్వామి జయంతిని ఆదివారం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని మొల్లేటి రామస్వామి, ఆదిలక్ష్మి దంపతుల విగ్రహాలకు ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు రామస్వామి కుటుంబ సభ్యులు, స్థానికులు రామస్వామి దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేశారు. ఆలయ ఈఓ సత్యనారాయణరాజు మాట్లాడుతూ ఆలయ వ్యవస్థాపకుడు రామస్వామి కోట్లాది మంది భక్తుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచారన్నారు. బాలబాలాజీ ఆలయ నిర్మాణం ద్వారా గ్రామానికి ఎనలేని కీర్తి తీసుకువచ్చారని శ్లాఘించారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకుడు సత్యమూర్తి, ఆలయ ఉద్యోగులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

మామిడికుదురు: కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని రాజోలు మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పేర్కొన్నారు. సఖినేటిపల్లి మండలం గొంది గ్రామంలో ఆదివారం జరిగిన సమావేశంలో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన మామిడికుదురు మండలం మొగలికుదురు గ్రామానికి చెందిన కొల్లాబత్తుల మహాలక్ష్మిని ఘనంగా సత్కరించారు. కొల్లాబత్తుల శ్రీను ఇంటి వద్ద కొల్లాబత్తుల కింగ్స్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మహాలక్ష్మికి రూ.10 వేల ప్రోత్సాహం, మెమెంటో అందించి సత్కరించారు. కార్యక్రమంలో కొల్లాబత్తుల కింగ్స్ సోదరులు అశోక్‌కుమార్, శ్యాంబాబు, విజయ్‌కుమార్, శ్రీను, నాని, రమేష్, కిరణ్‌కుమార్, సుదర్శన్ పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో ఐసోలేషన్ వార్డు ఏర్పాటు



పి.గన్నవరం సీహెచ్‌సీలో కోవిడ్ ఐసోలేషన్ వార్డు

పి.గన్నవరం: ఇటీవల మళ్లీ కోవిడ్ కేసులు వెలుగు చూస్తున్న నేపథ్యంలో జిల్లా అధికారుల ఆదేశాలతో పి.గన్నవరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఐదు బెడ్లతో ఐసోలేషన్ వార్డు ఏర్పాటు చేసినట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ యు.రాఘవేంద్రరావు తెలిపారు. ముందు జాగ్రత్త చర్యగా నియోజకవర్గ స్థాయిలో ఇక్కడ వార్డు ఏర్పాటు చేసినట్టు ఆయన వివరించారు. నియోజకవర్గంలో ఎక్కడా కోవిడ్ కేసులు లేవన్నారు. కోవిడ్ పట్ల ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎవరికైనా కోవిడ్ లక్షణాలు కనబడితే వెంటనే ప్రభుత్వ వైద్యులను సంప్రదించాలని ఆయన సూచించారు.

ఆందోళనలో రైతాంగం

- డ్రెయిన్‌లో వదిలేస్తున్న రొయ్యల చెరువుల వ్యర్థాలు
- డ్రెయిన్ పరిధిలో 35 వేల ఎకరాల కొబ్బరి, వరి సాగు
- ప్రమాదంలో చింతలమోరి ఎత్తిపోతల పథకం
- పట్టించుకోని డ్రైనేజీ, రెవెన్యూ శాఖలు


వేపచెట్టు డ్రైన్‌లో పేరుకుపోయిన రొయ్యల వ్యర్థాలు


చింతలపల్లిలో వేప చెట్టు డ్రైన్‌లోకి చేరుతున్న రొయ్యల చెరువుల వ్యర్థాలు

మలికిపురం: రొయ్యల వ్యర్థాలు, రొయ్యల సాగు చెరువుల్లో మిగిలిన వ్యర్థాలు కూడా ఆ రొయ్యలకే నష్టం కలిగిస్తాయి. అటువంటి వ్యర్థాల నిర్వహణ సక్రమంగా లేక ప్రజలతో పాటు సంప్రదాయ వ్యవసాయ రంగాలు నాశనమవుతున్నాయి. అరకొర మౌలిక వసతులతో రొయ్యల సాగు రైతులు అవలంబిస్తున్న విధానాల వల్ల వరి, కొబ్బరి, ఇతర వ్యవసాయ పంటల సాగు రైతులు నష్ట పోతున్నారు. కళ్లెదుటే రొయ్యల వ్యర్థాలను పంట పొలాలు, నివాస ప్రాంతాల మీదుగా వెళ్లే వ్యవసాయ పొలాల మధ్య నుంచి వెళ్లే డ్రైన్‌లోనే వదిలేస్తున్నా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ప్రజలు, రైతులు ఉన్నారు. రాజోలు మండలం చింతలపల్లి, శివకోడు, మలికిపురం మండలం మట్టపర్రు గ్రామాల్లో ఆక్వా రైతులు విచ్చలవిడిగా రొయ్యల చెరువుల్లో వ్యర్థాలను ఇష్టానుసారం డ్రైన్ లోకి వదిలేస్తున్నారు. ఇవి డ్రైన్లలో పేరుకుపోయి ముందుకు సాగక ఇటు కొబ్బరి, వరి సాగు రైతులకు తీరని నష్టాన్ని కలగజేస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. ఈ గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా అనుమతి లేని ఆక్వా సాగు జరుగుతుంది. ప్రస్తుతం వేసవి కావడంతో రొయ్యల చెరువులను బాగు చేసుకునే నిమిత్తం ఆక్వా రైతులు చెరువుల్లోని అట్టడుగున ఏళ్ల తరబడి పేరుకు పోయిన వ్యర్థాలను ప్రస్తుతం వ్యవసాయ డ్రైన్‌లోకి ఇంజిన్లను వినియోగించి తోడేస్తున్నారు. ఊబిగా పేర్కొనే ఈ వ్యర్థాలు డ్రైన్ల నుంచి కూడా ఏ మాత్రం ముందుకు పారలేవు. వీటిని ప్రత్యేక వాహనాల ద్వారా దూరంగా తరలించాల్సి ఉండగా రైతులు ఇలా డ్రైన్లలో వదిలేస్తున్నారు. ఫలితంగా డ్రైన్ అడుగుభాగంలో బిగుసుకుపోతాయి. అసలే డ్రైన్లకు మరమ్మతులు లేవు. సాధారణ బురదతోనే పూడుకుపోయి మురుగు ముందుకు సాగడం లేదు. దీనికి తోడు ఈ వ్యర్థాలు కూడా పేరుకు పోవడంతో ముందు ముందు వర్షాకాలంలో రైతులకు తీవ్ర ఇబ్బందులు తెస్తాయి. పైగా ఈ వ్యర్థాలు కలుషితమై అంటు రోగాలకు కారణం కావడంతో పాటు ఇతర పంటల సాగును కూడా తీవ్రంగా దెబ్బ తీస్తాయి. కనీసం పూడిక తీద్దామన్నా డబ్బుల లేని డ్రైన్స్, ఇరిగేషన్ అధికారులను వెంటపెట్టుకుని రాజోలు నియోజక వర్గ కూటమి నేతలు ఇటీవలే నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వద్దకు వెళ్లి నిధుల కోసం వినతిపత్రం ఇచ్చారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ నేతృత్వంలో శనివారం ఒక బృందం డ్రైన్లను సర్వే చేసి పూడిక వల్ల పని చేయని డ్రైన్ల నుంచి మురుగును ఎత్తి ఎలా పోయాలో ప్రణాళికలు రూపొందిస్తున్నారు. కానీ ఆక్వా రైతులు అక్రమ విధానాల వల్ల డ్రైన్లు ఇటువంటి దుస్థితికి రాకుండా రైతులు చేస్తున్న విజ్ఞప్తులను ఆ శాఖల అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. అసలే నిధులు లేక పనులు లేక ఖాళీగా ఉన్న డ్రైనేజీ శాఖల అధికారులు కనీసం ప్రజల నుంచి వచ్చే డ్రైన్‌ల దుస్థితి విజ్ఞప్తులను కూడా పట్టించుకోక పోవడం దారుణం. వేపచెట్టు డ్రైన్ పరిధిలో సుమారు ఐదు వేల ఎకరాల వరి ఆయకట్టు ఉంది. సుమారు 30 వేల ఎకరాల్లో కొబ్బరి చెట్లు ఉన్నాయి. అసలే శంకరగుప్తం మేజర్ డ్రైన్‌తో పాటు అంతర్వేది, గొంది డ్రైన్ల పరిధిలో ఈ రొయ్యల వ్యర్థాల వల్లే వరి, కొబ్బరిచెట్లు చనిపోయాయని నివేదికలు డ్రైనేజీ శాఖ వద్ద ఉన్నాయి. ఇప్పటికే న్యాయం చేయాలంటూ కలెక్టర్, మంత్రుల చుట్టూ రైతులు తిరుగుతున్నారు. తాజాగా నియోజకవర్గంలో మరో ప్రధానమైన వేప చెట్టు డ్రైన్ పరివాహక రైతులు కూడా ఆ జాబితాలో చేరారు.

ప్రమాదంలో చింతలమోరి ఎత్తిపోతల పథకం

శంకరగుప్తంలో శంకరగుప్తం మేజరు డ్రైన్‌పై ఉన్న చింతలమోరి ఎత్తిపోతల పథకానికి ఈ వేప చెట్టు డ్రైన్ నుంచి వెళ్లే మిగులు, మురుగునీరే ఆధారం. వేపచెట్టు డ్రైన్ నుంచి వెళ్లే ముంపు, వ్యవసాయ మురుగునీరు కత్తిమండ డ్రైన్‌లో పడి అక్కడ నుంచి చింతలమోరి ఎత్తిపోతల పథకానికి కాస్త ఎగువన శంకరగుప్తం డ్రైన్‌లో పడుతుంది. ఈ పతకం పరిధిలో వేలాది ఎకరాల సరుగుడు సాగు రైతులు ఉన్నారు. రూ.30 కోట్లతో ఈ పథకం ఏర్పాటు చేశారు. ఇక్కడ అనేక నివాస గృహాలు కూడా ఉన్నాయి. వెంటనే వేప చెట్టు డ్రైన్‌ను పరి రక్షించాలని రైతులు కోరుతున్నారు.

> **ఆక్వా రైతుల ఆగడాలను అరికట్టాలి**
>
> 
>
> చింతలపల్లి, మట్టపర్రు గ్రామాల్లో అనుమతి లేని ఆక్వా చెరువుల నుంచి రైతులు ఇష్టానుసారం వ్యవసాయ డ్రైన్‌లోకి రొయ్యల చెరువుల్లో వ్యర్థాలు వదిలేస్తున్నారు. గత రెండు రోజులుగా ఇష్టానుసారం ఇంజిన్లతో విషపూరిత వ్యర్థాలను తోడేస్తున్నారు. ఎన్ని విజ్ఞప్తులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ డ్రైన్ పరిధిలో దిగువన ఉన్న వరి, కొబ్బరి సాగు రైతులు నష్టపోతున్నారు.
>
> – తాడి సత్యనారాయణ, రైతు, మట్టపర్రు

సేంద్రియ ఎరువులతో పొలాలకు సారం


మొసలపల్లిలో వరి చేలో ఉంచిన గొర్రెల మంద

అంబాజీపేట: సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా భూసారాన్ని పెంచుకోవడంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఎక్కువ దిగుబడుల కోసం అధికంగా రసాయన ఎరువులు వినియోగిస్తున్న తరుణంలో భూసారం క్షీణించి పైరును తెగుళ్ల కబళిస్తున్నాయి. అవగాహన లోపంతో ఎదురవుతున్న కష్టాలను తొలగించుకోవాలంటే సేంద్రియ ఎరువుల వినియోగం తప్పనిసరని అన్నదాతలు గుర్తిస్తున్నారు. మండలంలో వరి, కొబ్బరి, అరటి, కోకో తదితర పంటలు పండించే భూములకు గొర్రెలు, మేకలు, ఆవుల విసర్జితాలను అందించడంపై ఆసక్తి చూపుతున్నారు. ఈ ఎరువులు భూసారాన్ని కాపాడతాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పంటకు జనసత్వాలు ఇచ్చి నాణ్యమైన దిగుబడులు పెంపుదలకు దోహదం చేస్తాయంటున్నారు. ప్రస్తుత సీజన్‌లో గొర్రెల మందలు రావడంతో పొలాల్లో నిలగడుతున్నారు. అధిక రసాయన, పురుగుమందుల వినియోగం వల్ల సారం కోల్పోయిన నేలలను సేంద్రియ ఎరువు వినియోగంతో తిరిగి సారవంతం చేయవచ్చని చెబుతున్నారు. పశువుల, గొర్రెల మూత్ర విసర్జనతో భూమిలోని చౌడు విరిగిపోతుందని, వీటి విసర్జితాలలో నత్రజని, భాస్వరం, పొటాష్‌తో పాటు సూక్ష్మ పోషకాలు లభిస్తాయని రైతులు సత్యనారాయణ, రాజగోపాలం చెబుతున్నారు. మందకట్టుతో విసర్జితాలు నేరుగా భూమిలోకి వెళ్లడంతో అధిక లాభాలు ఉంటాయని వ్యవసాయాధికారులు చెప్పారన్నారు. మంద కట్టిన తర్వాత భూమిని దుక్కు దున్నుకోవాలన్నారు. పొలాల్లో పశువులను కట్టడం ద్వారా నత్రజని, భాస్వరం, పొటాష్ లభిస్తుందన్నారు. మేలు చేసే సూక్ష్మజీవులు అభివృద్ధి చెందుతాయన్నారు. తెగుళ్లు తగ్గుతాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

పదవులను బాధ్యతగా తీసుకోవాలి


సమావేశంలో మాట్లాతున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: పదవులను బాధ్యతగా తీసుకోవాలని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పేర్కొన్నారు. రాజోలు నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీకి చెందిన ఏడుగురికి జిల్లా పార్టీ కమిటీలో స్థానం లభించింది. వివరాలను ఆదివారం మలికిపురం పార్టీ కార్యాలయంలో సూర్యారావు ప్రకటించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా కూనపరెడ్డి ఎస్ఆర్‌కే ప్రసాద్ (రాంబాబు), జిల్లా జనరల్ సెక్రటరీగా ఈద రవిరెడ్డి, జిల్లా ఆర్గనైజేషన్ కార్యదర్శులుగా తులా సత్యనారాయణ, కొల్లాటి నరసింహస్వామి, యాక్టివిటీ కార్యదర్శులుగా తాడిచర్ల మల్లీశ్వరి, మోకా సురేష్, జిల్లా అధికార స్పోక్స్ ప్రతినిధిగా ఉచ్చిలి విష్ణుమూర్తి నియమితులయ్యారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో జిల్లా పార్టీ అధ్యక్షుడు జగ్గిరెడ్డి సిఫారసుల మేరకు ఈ పదవుల నియామకం జరిగిందని సూర్యారావు అన్నారు. పదవులు పొందిన నాయకులు పార్టీ కోసం కష్టపడి పని చేయాలని సూర్యారావు సూచించారు. సమావేశంలో సఖినేటిపల్లి మండల పార్టీ అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, సూరిశెట్టి బాబీ, మంగెన సింహాద్రి, గుబ్బల సత్యనారాయణ, గుర్రం జాషువా, మోకా సురేష్, జిల్లెళ్ల ఉదయ్ కిరణ్, నేతల నాని పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటమే అజెండా


సమావేశంలో మాట్లాడుతున్న కో–ఆర్డినేటర్ శ్రీనివాసరావు

మామిడికుదురు: ప్రజా సమస్యలపై పోరాటం చేయడమే వైఎస్సార్ సీపీ అజెండా అని పి.గన్నవరం నియోజకవర్గం కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, పార్టీ పరిశీలకుడు మార్గాని గంగాధర్, పేరి కామేశ్వరరావు అన్నారు. పాశర్లపూడిలో మాజీ సర్పంచ్ మొల్లేటి త్రిమూర్తులు స్వగృహం వద్ద ఆదివారం మండల కార్యకర్తల సమావేశం జరిగింది. ప్రజల సమస్యల పరిష్కారం కోసం తిరుగులేని పోరాటం చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం దుర్మార్గమైన పాలనకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామని చెప్పారు. కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఎటువంటి ఇబ్బందులకు గురి చేసినా ఉపేక్షించేది లేదన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలుతో పాటు స్థానిక సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. నూతన కమిటీల ఏర్పాటు ద్వారా పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా కార్యాచరణ చేపట్టామని చెప్పారు. పార్టీ శ్రేణులు సైతం పార్టీ కోసం చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, ఎంపీపీ కుసుమ వనజకుమారి, ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు తోరం గౌతమ్, పార్టీ నేతలు నీతిపూడి గణేష్‌బాబు, నెల్లి దుర్గాప్రసాద్, కొనుకు నాగరాజు, చిక్కం బుజ్జిబాబు, జక్కంపూడి వాసు, తులా గోపాలకృష్ణ, తోలేటి ఆదినారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అహల్యాబాయి హోల్కర్ జయంతి


భగవద్గీత పోటీల్లో బంగారు పతకం సాధించిన నిత్యను సత్కరిస్తున్న వేమా

రాజోలు: ఇండోర్ రాజ్యాన్ని పాలించిన అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతిని ఆదివారం రాజోలులో దత్తాత్రేయ అపార్ట్‌మెంట్‌లో నిర్వహించారు. 1767 నుంచి 1795 వరకు స్త్రీ శక్తికి మారుపేరుగా అహల్యాబాయి హోల్కర్ పరిపాలన సాగించారని మాజీ ఎమ్మెల్యే వేమా అన్నారు. అలాగే ఇటీవల మైసూర్ దత్తపీఠం సచ్చిదానంద స్వామిజీ నిర్వహించిన భగవద్గీత పోటీల్లో బంగారు పతకం సాధించిన నారంభట్ల నిత్యను సత్కరించారు. శివాజీ మహారాజ్ ప్రతిమను నిత్యకు బహూకరించారు. ఆర్యవైశ్య మహిళా సంఘ అధ్యక్షురాలు కాసు భవానీ, కార్యదర్శి కొత్త భవానీలు చిన్నారి నిత్యకు పట్టువస్త్రాలు అందజేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కాసు శ్రీనివాస్, మేడిచర్ల చాణిక్య, దేవళ్ల మాణిక్యాలరావు, అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం, అడబాల రాంబాబు, రాజా నాగరత్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గురువును ఆశ్రయించినవాడే నిజమైన భక్తుడు


విశేష పూజలు నిర్వహిస్తున్న ప్రభూజీ సుందర శ్రీనివాస్‌దాస్

అయినవిల్లి: పరంపర ఆచార్యుడిని గురువుగా స్వీకరించినవాడే నిజమైన భక్తుడని, పరంపర నుంచి వచ్చిన గురువును ఆశ్రయించిన భక్తుడు సాధన ద్వారా భగవంతుడి నిజమైన రూపం దర్శనమిస్తుందని నల్లచెరువు అంతర్జాతీయ మందిర్ నిర్వాహకుడు ప్రభూజీ సుందర శ్రీనివాసదాస్ అన్నారు. ఆదివారం ప్రభూజీ సుందర శ్రీనివాస్‌దాస్ స్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ స్వామికి విశేష పూజలు చేశారు. హరినామ సంకీర్తనలు, తులసి పూజ, పంచామృతాభిషేకం నిర్వహించారు. శ్రీమద్భాగవత ప్రవచనం నిర్వహించారు. మందిరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అనంతరం భక్తులకు మహాప్రసాద వితరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ పూజల్లో పాల్గొని స్వామిని కీర్తించారు. స్వామివారి ప్రసాదం స్వీకరించారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం


రావులపాలెంలో క్యాన్సర్ బాధితుడి భార్యకు చెక్కు అందజేస్తున్న సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న బాధితుడి వైద్య ఖర్చుల నిమిత్తం స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ ఆర్థిక సాయం అందించి తన ఔదార్యాన్ని చాటుకుంది. అంబాజీపేట మండలం చిరతపూడి గ్రామానికి చెందిన పితాని రమేష్‌కి నోటిలో కణితి ఏర్పడి క్యాన్సర్‌గా మారింది. దానికి ఆపరేషన్ చేసి కణితి తొలగించి క్యాన్సర్‌కి కీమో రేడియేషన్ ట్రీట్మెంట్ చేస్తున్నారు. వైద్యానికి చాలా ఖర్చు అవుతుండటంతో కూలి పని చేసుకుని కుటుంబాన్ని పోషించుకునే ఆ క్యాన్సర్ బాధితుడికి తగిన ఆర్థికస్తోమత లేక రావులపాలెం కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థను ఆశ్రయించారు. అతడి కుటుంబ ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని ఆర్థిక సాయం చేయడానికి సేవా సంస్థ వారు ముందుకు వచ్చారు. ఆ మేరకు ఆదివారం సాయంత్రం సేవా సంస్థ సభ్యులు క్యాన్సర్ బాధితుడు రమేష్ భార్య చంద్రకళకు రూ.11,500 చెక్కు రూపంలో అందజేశారు. ఆమె సేవా సంస్థ సభ్యులకు కృతజ్ఞతలు తెలియచేశారు.

ఉద్యానవనం.. నిర్వహణ అధ్వానం

సిమెంట్ బల్ల శిథిలం కావడంతో డ్రెయిన్‌లో పడ్డ బాలుడు


అమలాపురం ఉద్యానవనం (పార్కు)లో డ్రెయినేజీపై శిథిలమైన సిమెంట్ బల్ల

అమలాపురం టౌన్: మున్సిపాలిటీ ఆధీనంలోని చంద్రబాబు ఉద్యాన వనం (పార్కు) ఇటీవల శిథిలావస్థకు చేరుకుంది. దీంతో సందర్శకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారి ఆందోళనకు తగినట్టుగానే సరదాగా పార్కునకు వచ్చిన ఓ పదేళ్ల బాలుడు ఆడుకుంటూ మూత లేని పార్కు డ్రెయిన్‌లో ఆదివారం ప్రమాదవశాత్తు పడ్డాడు. డ్రెయిన్‌లోని మురికి నీటిలో పడ్డ బాలుడు వెంటనే తేరుకుని ఏటువంటి గాయాలు లేకుండానే బయటపడ్డాడు. దీంతో సందర్శకులు ఊపిరి పీల్చుకున్నారు. డ్రెయిన్‌పై ఉన్న బల్ల శిథిలమై ప్రమాదకరంగా మారడంతోనే బాలుడు అందులో పడ్డాడని స్థానికులు అన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు పార్కు దుస్థితిపై స్పందించి చర్యలు చేపట్టాలని రోజూ ఆ పార్కుకు వచ్చే సందర్శకులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికే ఆ పార్కులో పిల్లలు ఆడుకునే పరికరాలు కొన్ని తప్పు పట్టు మరికొన్ని ధ్వంసమై అసౌకర్యంగా ఉన్నాయి. ఇటీవల ఓ బాలుడు ఆట పరికరాలతో ఆడుకుంటున్న సమయంలో తుప్పు పట్టిన రేకు వల్ల చేతికి గాయాలయ్యాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు పార్కు పురోభివృద్ధికి చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

కాలువను తలపిస్తున్న రహదారి


విలసవిల్లిలో కాలువను తలపిస్తున్న రోడ్డు

ఉప్పలగుప్తం: విలసవిల్లిలో సాయిబాబా గుడి ఆవరణలో రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు కాలువను తలపిస్తోంది. మూడు రోజుల క్రితం కురిసిన ఓ మోస్తరు వర్షానికి రోడ్డు జలమయమైందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. గతంలో వర్షం నీరు దిగుడుకు డ్రెయిన్ వ్యవస్థ ఉండేదని, ఇటీవల నూతనంగా సీసీ రోడ్డును నిర్మాణంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో డ్రెయిన్‌ను పూర్తిగా మూసివేసారన్నారు. దీనితో రోడ్డుపై మోకాళ్ల లోతులో నీరు చేరి ఇళ్లల్లోకి ప్రవేశిస్తోందని, రాక పోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతోందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మురుగుకాలువ తవ్వకాల పరిశీలన


నర్శిపూడిలో మురుగుకాలువ పూడికతీత పనులను పరిశీలిస్తున్న డీఈ పోచారావు తదితరులు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న మురుగు కాలువ తవ్వకాల పనులను బుధవారం ఇరిగేషన్ అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆదివారం పరిశీలించారు. ఆలమూరు సాగునీటి డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు మెర్ల గోపాలస్వామి ఆధ్వర్యంలో నర్శిపూడిలో రూ.17 లక్షలతో గత వారం రోజుల నుంచి జరుగుతున్న పూడికతీత పనులను నీటిపారుదల శాఖ డ్రైన్స్ విభాగం డిప్యూటీ ఇంజినీర్ పోచారావు, ఏఈ సుబ్రహ్మణ్యం పరిశీలించారు. అలాగే చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాస్ చౌదరి పర్యవేక్షణలో జరుగుతున్న జొన్నాడ–పెనికేరు మురుగుకాలువ తవ్వకాల పనులను వారు పరిశీలించి పలు సూచనలు, సలహాలు అందజేశారు. మండలంలోని మిగతా మురుగు కాలువల పూడికతీత పనులను చేపట్టేందుకు వీలుగా పూర్తి స్థాయిలో నిధులు మంజూరు చేస్తామని డీఈ పోచారావు హామీ ఇచ్చారు.

గ్రామస్తుల చేతిలో రక్తపింజరి హతం


అంతర్వేది దేవస్థానంలో హతమైన రక్తపింజరి పాము

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానం గ్రామంలోని రాజుల అన్నదాన సత్రంలో ఆదివారం మూడు అడుగుల రక్తపింజరి పాము గ్రామస్తుల చేతిలో హతమైంది. సత్రం నిర్వాహకులు ప్రమాదకరమైన ఈ పామును గుర్తించి, స్థానికుల సహకారంతో అంతమొందించారు. కాగా రోడ్ల నిర్మాణాలకు ఎగువ ప్రాంతాల నుంచి లారీల్లో దిగుమతి అవుతున్న ఎర్రకంకర లోడ్‌తో రక్తపింజరి పాము వచ్చి ఉంటుందని గ్రామస్తులు పేర్కొన్నారు.

భారీ అన్న సమారాధన

ఆలమూరు: మండలంలోని పెదపళ్లలో వేంచేసిన అభయాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం భారీ అన్న సమారాధన జరిగింది. ఇటీవల జరిగిన హనుమజ్జయంతి పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సుమారు మూడు వేల మందికి పిండివంటలతో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి ఈ అన్న సమారాధనను స్వీకరించారు. అనంతరం ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.85,642 విరాళం


దాత చంద్రశేఖర్ కుటుంబ సభ్యులకు స్వామి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి రాజమహేంద్రవరానికి చెందిన కురిసెట్టి చంద్రశేఖర్ గుప్తా–ప్రత్యూష దంపతులు రూ.50,409, సీతానగరం మండలం మునికూడలికి చెందిన గోలి లక్ష్మీఅక్షయ రూ.15,001, పేరూరుకు చెందిన ఉపాధ్యాయుల భానుప్రియ రూ.10,116, విజయవాడకి చెందిన గొనుగుంట పృథ్వీరాజ్ జ్యోతిర్మయి రూ.10,116 విరాళం అందజేశారు. ఈ సొమ్మును దాతలు ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావుకు అందజేశారు. దాతలను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

అమలాపురం రూరల్: దీపం బుడ్డి కారణంగా చీరకు నిప్పు అంటుకుని తీవ్ర గాయాలు పాలై కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి చెందింది. అమలాపురం మండలం కామనగరువు గ్రామ పరిధి కరక్కాయపేటకు చెందిన భీమవరపు వెర్రమ్మ (74) ఈనెల 16వ తేదీ రాత్రి ఇంటి వద్ద కరెంటు పోవడంతో దీపం బుడ్డి వెలిగించింది. ఆమె పెంపుడు కోళ్లకు మేత పెడుతున్న సమయంలో హఠాత్తుగా దీపం బుడ్డి మంట చీరకు అంటుకుంది. దాంతో ఆమె కాలు కాలిపోయింది. గాయాలపాలైన వెర్రమ్మను అమలాపురం ఏరియా ఆసుపత్రికి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై శేఖర్‌బాబు ఆదివారం తెలిపారు. మృతురాలి కుమారుడు సత్తిబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా ఎస్సై తెలిపారు.

పూడిక తొలగింపు

అమలాపురం రూరల్: చిందాడగరువు వద్ద మూసుకుపోయిన వాసాలతిప్ప డ్రెయిన్‌లోని పూడిక తొలగింపు పనులను ఎట్టకేలకు అధికారులు చేపట్టారు. ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకుండా ఇసుక స్టాక్ యార్డు ఏర్పాటు చేసి ఇసుకను స్టోరేజ్ చేయడం వల్ల డ్రెయిన్ మూసుకుపోయిందని సాక్షిలో 22న వచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. డ్రెయిన్‌లో మట్టి, పూడిక తొలగింపు పనులు ఆదివారం చేపట్టారు. స్టాక్ యార్డును బైపాస్ రోడ్డు వంతెన పక్కన ఉన్న స్థలంలోకి మార్పు చేశారు.